క్లుప్తంగా

బోధన్ డివిజన్ రెడ్డి సంఘం నూతన కమిటీ ఎన్నిక



బోధన్‌టౌన్(బోధన్): బోధన్ డివిజన్ రెడ్డి సంఘం సమావేశం పట్టణంలోని రైస్‌మిల్ అసోసియేషన్ భవనంలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా డివిజన్ రెడ్డి సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా సాంబిరెడ్డి, అధ్యక్షులుగా పోతారెడ్డి, ఉపాధ్యాక్షులుగా ధనుంజయ్ రెడ్డి, సంజీవ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గడ్డం లక్ష్మణ్ రెడ్డి, సహాయ కార్యదర్శులుగా రమేష్ రెడ్డి, ఆర్గనైజర్ సెక్రటరీగా నరేందర్‌రెడ్డి, కోశాధికారిగా వెంకటరెడ్డి, ముఖ్య సలహాదారులుగా తూము శరత్ రెడ్డి ఇతర సలహాదారులుగా ప్రతినిధులను ఎన్నుకున్నారు. ఎన్నికైన ప్రతినిధులు రాజ బహదూర్ వెంకట్‌రాం రెడ్డి చిత్ర పటానికి నివాళులు అర్పించారు.

సంస్కృతి, సంప్రదాయాలను మరువొద్దు



బోధన్‌టౌన్(బోధన్): విద్యార్థులు మన పూర్వికులు చూపించిన ఆచరించిన సంస్కృతి, సంప్రదాయాలను మరిచిపోవద్దని బోధన్ డిప్యూటీ డీఎంహెచ్‌వో సమత అన్నారు. సోమవారం పట్టణంలోని ఉషోదయ డిగ్రీ కళాశాలల ఆధ్వర్యంలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు బోనాలు ఎత్తుకొని బాజాభజంత్రీల మధ్య ఊరేగింపుగా నల్ల పోచమ్మ, మహాలక్ష్మి అమ్మవార్ల ఆలయాలకు వెళ్లి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. అనంతరం మొక్కులు తీర్చుకున్నారు. వర్షాలు బాగా కురిసి, పంటలు బాగా పండి, ప్రజలు అందరు ఆర్యోగాలతో ఉండాలని కోరారు. ఉషోదయ విద్యా సంస్థల చైర్మన్ సూర్యప్రకాష్, కళాశాలల ప్రిన్సిపాల్ గంగాధర్, హరికృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దాడులు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



రుద్రూర్: కోటగిరి మండలం బస్వాపూర్ గ్రామంలో ముదిరాజ్‌లపై దాడులకు పాల్పడ్డ వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని జిల్లా ముదిరాజ్ సంఘం జిల్లా నాయకులు కరాటే రమేష్ , నీరడి గంగాధర్ డిమాండ్ చేశారు. సోమవారం వారు బాధితులతో కలిసి రుద్రూర్ సీఐ కార్యాలయానికి తరలివచ్చారు. బస్వాపూర్ గ్రామంలో మత్స్య పారిశ్రామిక సంఘం ఏర్పాటుకు అధికారులు వచ్చిన సమయంలో కొందరు ముదిరాజ్‌లపై దౌర్జన్యానికి దిగారని వారు ఫిర్యాదు చేశారు. ముదిరాజ్ సంఘం జిల్లా నాయకులు గణేష్, రమేష్, ఒడ్డెన్న, వేణు, రాములు, సుదర్శన్, ఉత్తమ్ తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 10 నుంచి జలాల్ బుకారి దర్గా ఉర్సు



బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని రెంజల్ బేస్‌లోగల జలాల్ బుకారి దర్గ ఉర్సు ఉత్సవాలు వచ్చే నెల 10వతేదీ నుంచి సజ్జదే నశీ ముక్తైదార్, ఉర్సు కమిటీ ప్రధాన కార్యదర్శి యూనుస్ పటేల్ తెలిపారు. సోమవారం ఉర్సు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ ఉర్సు ఉత్సవాలు 10,11,12 మూడు రోజుల పాటు సాగుతాయని పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

కమ్మర్‌పల్లి : మండలంలోని హసాకొత్తూర్ గ్రామానికి చెందిన ఇరగదిండ్ల శేఖర్ రెండు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మరణించారు. సోమవారం బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి పరామర్శించి రూ. 10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. అదే గ్రామానికి చెందిన జుంబరాత్ అన్వేష్ ఓమన్ దేశంలో మరణించగా, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి గల్ఫ్ బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం అందించే రూ. 5 లక్షల సహాయాన్ని అందించడానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. ఉప్లూర్ మాజీ సర్పంచ్ రమేష్‌రెడ్డి తండ్రి మరణించగా, అజయ్ తల్లి చనిపోగా ఆయనను సునీల్‌రెడ్డి పరామర్శించారు. ఏఎంసీ చైర్మన్ నర్సయ్య, నాయకులు కొమ్ముల రవీందర్‌రెడ్డి, రేవతి గంగాధర్, తిప్పిరెడ్డి శ్రీను, పడిగెల ప్రవీణ్‌రెడ్డి, బోనగిరి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రికి రోగుల తాకిడి

- వాతావరణ మార్పులతో అనారోగ్యం బారిన ప్రజలు
- ఆర్మూర్ మున్సిపల్‌పరిధిలో అధ్వానంగా పారిశుద్ధ్యం



రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు



ఆర్మూర్ ఏరియా ఆస్పత్రిలో క్యూ కట్టిన రోగులు

ఆర్మూర్‌టౌన్ : వాతావరవణంలో మార్పులతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. ఉదయం ఎండ, రాత్రివేళ వర్షం కురవడంతోపాటు దోమ కాటు జ్వరాలతో ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లే బాధితుల సంఖ్య పెరుగుతోంది. జ్వరం, జలుబుతో పాటు తదితర వ్యాధులతో రోజుకు 250కి పైగా ఓపీ వస్తుందని వైద్యులు చెబుతున్నారు. బాధితులకు రక్తపరీక్షలు నిర్వహించినంతరం మందులు అందిస్తున్నారు. పట్టణంలోని 36 వార్డులలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. పట్టణంలో ఫాగింగ్ చేయకపోవడంతో దోమల బెడద నెలకొంది. దీంతో ప్రజలకు సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. మున్సిపల్ అధికారులు స్పందించి పట్టణంలో పారిశుద్ధ్య నివారణ, దోమల నివారణకు ఫాగింగ్ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

రోగాలబారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. తమ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలి. జ్వరం, జలుబు, ఒళ్లు నొప్పులు ఉంటే వెంటనే సమీప ఆస్పత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలి. వేడిచేసి చల్లార్చిన నీరును తాగాలి. ఆస్పత్రిలో సీజనల్ వ్యాధులకు సంబంధించిన అన్నిరకాల మందులు అందుబాటులో ఉన్నాయి.

– ప్రమీదరెడ్డి, సూపరిటెండెంట్, ఏరియా ఆస్పత్రి, ఆర్మూర్

మత్తు పదార్థాలపై ప్రత్యేక దృష్టి సారించాలి

నవీపేట: నవీపేట పోలీస్ స్టేషన్‌ను సీపీ సాయి చైతన్య సోమవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. కంప్యూటర్ సెక్షన్, వాహనాల పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించారు. గ్రామాలలో సీసీ కెమెరాల ఏర్పాటుపై వీడీసీలకు అవగాహన కల్పించాలని నార్త్‌రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై వినయ్‌లకు సూచించారు. గ్రామ పోలీస్ అధికారులు విధులను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. గంజాయి, మత్తుపదార్థాలపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు.



నవీపేట పోలీస్ స్టేషన్‌లోని రికార్డులను పరిశీలిస్తున్న సీపీ సాయిచైతన్య

శివాలయంలో ప్రత్యేక పూజలు

ఆర్మూర్‌టౌన్ : పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై గల శివాలయంలో సోమవారం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే భక్తులు రామాలయం, అయ్యప్పఆలయం, దుర్గామాత, హనుమాన్ ఆలయాన్ని సందర్శించి పూజలు చేపట్టారు. అనంతరం నందీశ్వర మహారాజ్ సమక్షంలో స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఆలయ పరిసర ప్రాంతాల్లో పల్లకీ సేవ నిర్వహించారు అనంతరం భక్తులు తీర్థ ప్రసాదాలతో పాటు అన్న ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో సుమన్, పీసీ గంగారెడ్డి, మల్లయ్య, కొంత మంజుల, చరణ్ రెడ్డి, జిమ్మిరవి తదితరులు పాల్గొన్నారు.



స్థానిక ఎన్నికలకు సన్నద్ధం కావాలి



సాటాపూర్‌లో మాట్లాడుతున్న భూంరెడ్డి



కోటగిరిలో మాట్లాడుతున్న జుబేర్



అంబం(ఆర్)లో మాట్లాడుతున్న మధు

రెంజల్(బోధన్): స్థానిక సంస్థల ఎన్నికల సమరానికి నాయకులు, కార్యకర్తలు సన్నద్ధం కావాలని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు భూంరెడ్డి సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉందన్నారు. దాన్ని అనుకూలంగా మార్చుకుని ఎన్నికల్లో విజయం సాధించాలని పేర్కొన్నారు. మండలంలోని సాటాపూర్ గ్రామంలో సోమవారం బీఆర్ఎస్ మండల స్థాయి నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయనతో పాటు మరి కొందరు నాయకులు మాట్లాడుతు నియోజకవర్గంలో బీఆర్ఎస్ బలంగా ఉందన్నారు. సమావేశంలో సాటాపూర్, తాడ్‌బిలోలి గ్రామాల మాజీ సర్పంచ్‌లు ఎఖార్‌పాష, తెలంగాణ శంకర్, నీలా విండో చైర్మెన్ ఇమాంబేగ్, నాయకులు ఖదీర్, రాఘవేందర్, రఫీక్, తిరుపతి బుజ్జి, యుసూఫ్, లోలపు వినయ్, రాము, హైమద్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

కోటగిరి (రుద్రూర్) : ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందనిబాన్సువాడ మున్సిపల్ మాజీ వైస్ చైర్మెన్ జుబేర్ అన్నారు. ఈవిషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని పిలుపునిచ్చారు. కోటగిరి మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ సీఎం కేసీఆర్ అందించిన పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు. తద్వారా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పట్టు బిగించాలని సూచించారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రుద్రూర్ : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించాలని మండల బీఆర్ఎస్ ఇన్‌చార్జి గాండ్ల మధు అన్నారు. మండలంలోని అంబం (ఆర్), బొప్పాపూర్ గ్రామాల్లో సోమవారం పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. అనంతరం గ్రామాల్లో పర్యటించి బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధిని స్థానికులకు వివరించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడంలో విఫలమవుతుందని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను బల పరచాలని కోరారు. కార్యక్రమాల్లో మండల బీఆర్ఎస్ నాయకులు సాయిలు, సాయి కిరణ్, శేఖర్, నీరడి సాయిలు, జక్రి నరేందర్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో వెటర్నరీ సబ్ సెంటర్

- గొట్టిముక్కలలో భయంగా విధులు నిర్వహిస్తున్న పశువైద్యులు
- నూతన భవనం మంజూరు చేయాలని వినతి



వెటర్నరీ సబ్‌సెంటర్ లోపలి భాగం



వెటర్నరీ సబ్‌సెంటర్ ముందుభాగం



సబ్‌సెంటర్ వెనుకభాగంలో ఓ మూలపై పెద్ద చెట్టు

మాక్లూర్ : మండలంలోని గొట్టిముక్కల వెటర్నరీ సబ్‌సెంటర్ శిథిలావస్థకు చేరింది. ఏళ్ల గడుస్తున్న పాలకులు పట్టించుకోవడంలేదు. సబ్‌సెంటర్ ఎప్పుడు కూలుతుందో తెలియని దుస్థితిలో ఉండటంతో పశువైద్యులు భయం భయంగా విధులు నిర్వహిస్తున్నారు. సమీపంలోని 10 గ్రామాల రైతులు తమ పశువులను వైద్యం కోసం ఇక్కడికే తీసుకువస్తారు. ఈసబ్‌సెంటర్‌లో జూనియర్ పశువైద్యులు కల్యాణి, ఆఫీస్ సబార్డినేట్ శ్యామలలు పశువులకు వైద్యం అందిస్తున్నారు. సబ్‌సెంటర్ చుట్టూ పెద్ద చెట్లు, ముళ్లపొదలు, గడ్డిపెరిగిపోయి పాములు వస్తున్నాయి. గ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో మురుగునీరు వచ్చి ఆస్పత్రి ప్రాంగణంలో నిలుస్తోంది. దీంతో దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని పశువైద్య సిబ్బంది వాపోతున్నారు. వర్షకాలంలో మరిన్ని ఇబ్బందులు పడాల్సి ఉంటుందని పశువైద్య సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాలకులు స్పందించి నూతన భవనం లేదా ఉన్న భవనానికి మరమ్మతులు చేయించాలని స్థానిక రైతులు, పశుపెంపకందారులు కోరుతున్నారు.

కొత్త భవనం నిర్మించాలి



సబ్‌సెంటర్ శిథిలావస్థకు చేరింది. నూతన భవనం నిర్మించడానికి ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి నిధులు మంజూరు చేయించాలి. నూతన భవనం నిర్మించాలి.

– గంగాధర్, రైతు, రాంపూర్

డ్యూటీ చేయాలంటే భయంగా ఉంది



సబ్‌సెంటర్ శిథిలావస్థకు చేరింది. చుట్టూ ముళ్లపొదలు పెరిగిపోవడంతో పాములు వస్తున్నాయి. డ్యూటీ చేయాలంటే భయంగా ఉంది. సెంటర్‌లో కూర్చోవాలంటే భయంగా ఉంటుంది. అధికారులు, పాలకులు స్పందించి మరమ్మతులు చేయించాలి. లేదా కొత్త భవనం నిర్మించాలి.

– కల్యాణి, వెటర్నరీ సెంటర్ జూనియర్ పశువైద్యురాలు, గొట్టిముక్కల

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం



పశువుల ఆస్పత్రి సబ్‌సెంటర్ శిథిలావస్థకు చేరింది. ఈ విషయమై ఇటీవలే ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌దృష్టికి తీసుకెళ్లాం. కొత్త భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

– ముప్పా గంగారెడ్డి, రైతు, గొట్టిముక్కల

కుక్కల స్వైర విహారం



నందిపేటలో రాత్రివేళ గుంపులుగా తిరుగుతున్న వీధి కుక్కలు

నందిపేట్(ఆర్మూర్) : నందిపేటలో వీధి కుక్కల స్వైర విహారంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వీధులు, కాలనీలలో గుంపులుగా సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. రాత్రివేళ వాహనదారుల వెంటపడటంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. కుక్కలు గుంపులుగా తిరుగుతూ చిన్నపిల్లలపై, పశువులపై దాడులు చేసి గాయపరుస్తున్నాయి. విద్యార్థులను పాఠశాలకు పంపాలంటే తల్లిదండ్రులు జంకుతున్నారు. అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో నందిపేట మండల కేంద్రంలో కుక్కకాటుకు గురై పలువురు గాయపడ్డారు. శునకాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకొని ప్రజలను కాపాడాలని పలువురు కోరుతున్నారు.



దుకాణాల వద్ద తిరుగుతున్న కుక్కలు

గుంపులుగా దాడులు చేస్తున్నాయి

కుక్కలు గుంపులుగా తిరుగుతూ దాడులకు పాల్పడుతున్నాయి. రాత్రి సమయంలో మరింత రెచ్చిపోతున్నాయి. బయటకు వెళ్లాలంటేనే భయంగా ఉంది. అధికారులు చొరవ తీసుకుని వీధికుక్కలను నియంత్రించాలి. – మాన్సూర్ శ్యామ్, నందిపేట

చర్యలు తీసుకుంటాం

గతంలో వీధికుక్కలు స్వైర విహారం చేస్తున్న సంఘటనలను దృష్టిలో ఉంచుకుని వ్యాక్సినేషన్ చేసి బర్త్ కంట్రోల్‌ను చేశాం. స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వీధి కుక్కలను తరలించేందుకు చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాసరావు, ఎంపీడీవో, నందిపేట

సైబర్ నేరాలపై అవగాహన

నవీపేట : మండలంలోని నాళేశ్వర్‌లో విలేజ్ పోలీస్ ఆఫీసర్ నారాయణ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై సోమవారం అవగాహన కల్పించారు. సైబర్ నేరాలతో పాటు గంజాయి, మత్తు పదార్థాలు అరికట్టడంలో పోలీసులకు సహకరించాలని కోరారు. అసాంఘిక కార్యకలాపాలపై విలేజ్ పోలీస్ ఆఫీసర్, డయల్ 100, స్థానిక ఎస్సైకి సమా చారం ఇవ్వాలని తెలిపారు. ఇసుక అక్రమ రవాణా కట్టడికి కృషి చేస్తున్న పోలీసులకు సహకరించాలని కోరారు. ఎస్సై వినయ్, వీడీసీ ప్రతినిధులు ఉన్నారు.



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నేడు అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే సమీక్ష

ఆర్మూర్: ఆర్మూర్ పట్టణంలో ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి మంగళవారం పర్యటించనున్నట్లు బీజేపీ నాయకులు సోమవారం తెలిపారు. పట్టణంలో మున్సిపల్, రెవెన్యూ, ఆర్డీవో, పోలీస్‌స్టేషన్ల నూతన భవనాల నిర్మాణాల కోసం అధికారులతో కలిసి స్థల పరిశీలన చేస్తారని తెలిపారు.

అనంతరం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అధికారులతో పలు అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

గణేశ్ ఉత్సవాల ఏర్పాటుపై సమీక్ష సమావేశం

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండల కేంద్రంలో గణేశ్ ఉత్సవాల ఏర్పాటుపై సోమవారం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో యువజన సంఘాలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వినాయక చవితి సందర్భంగా పాటించాల్సిన నియమాలు, క్రమశిక్షణ అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. నిమజ్జన సమయంలో డబుల్ డీజే ఏర్పాటు చేయవద్దని, అలాగే ఒక్కో ప్రాంతానికి ఒక్కో డీజేని మాత్రమే ఏర్పాటు చేయాలని, అలాగే డీజే ఏర్పాటుకు పోలీసుల అనుమతి తీసుకోవాలని నిర్ణయించారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు బార్ల ముత్యం రెడ్డి, నవనీత్, నరేష్, కేశప్ప, గంగా రెడ్డి, గంగాధర్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



ఆలూర్‌లో సమావేశమైన గ్రామస్తులు

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



రెంజర్లలో చెక్కులను అందిస్తున్న నాయకులు



గుత్పలో చెక్కులు అందిస్తున్న నాయకులు

బాల్కొండ: ముప్కాల్ మండలం రెంజర్ల గ్రామానికి చెందిన బాధితులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు అందించారు. ఇద్దరు బాధితులకు మంజూరైన రూ. 52 వేల చెక్కులను అందించినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. మంజూరుకు కృషి చేసిన బాల్కొండ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, నాయకులు ఆకుల రమేశ్, హేమంత్, షరీఫ్, ప్రదీప్, అజయ్, సాగర్, బాస మల్లేశ్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మాక్లూర్: మండలంలోని గుత్ప గ్రామంలో బాధితులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు అందించారు. బాధితులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు గడ్డం శోభ రూ. 32,000, రాస సుశీల రూ. 20,000, బ్యాగరి రవితేజ రూ. 21,000 కాంగ్రెస్ సీనియర్ నాయకులు శశికుమార్, రవిగౌడ్, భూమేశ్వర్, ప్రసాద్‌లు అందించారు. కార్యక్రమంలో నాయకులు గంగాధర్, నరేష్, నవీన్, భూమన్న, రాజన్న, సాయి కుమార్, విజయ్‌గౌడ్‌లు పాల్గొన్నారు.

పీసీసీ అధ్యక్షుడిని కలిసిన డీసీసీబీ చైర్మన్



వేల్పూర్: ఉమ్మడి నిజామాబాద్ జిల్లా డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి సోమవారం హైదరాబాద్‌లో పీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్ కుమార్‌గౌడ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అభివృద్ధి, పనితీరు వివరించినట్లు పేర్కొన్నారు. అతి తక్కువ కాలంలో బ్యాంకు అభివృద్ధి చెందినందుకు ప్రత్యేకంగా అభినందినట్లు వెల్లడించారు. మహారాష్ట్రలో సహకార బ్యాంకులు రైతులకు బహుళ సేవలు అందిస్తున్నాయని, త్వరలో ఆ రాష్ట్రంలో పర్యటించి అక్కడి సహకార వ్యవస్థను అధ్యయనం చేసి, తెలంగాణాలో కూడా అటువంటి సేవలు అమలు చేయాలని సూచించినట్లు తెలిపారన్నారు.

పుప్పాల రాజేందర్ మరణం.. ఆర్ఎస్ఎస్‌కు తీరని లోటు



పెర్కిట్(ఆర్మూర్) : ఆర్ఎస్ఎస్‌లో క్రియాశీలకంగా ఉంటూ సేవా కార్యక్రమాలు చేపట్టిన పుప్పాల రాజేందర్ అకాల మరణం తీరని లోటని ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి అన్నారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ విశాఖ కాలనీలో సోమవారం ఏర్పాటు చేసిన పుప్పాల రాజేందర్ సంస్మరణ సభకు ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. రాజేందర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. రాజేందర్ కుటుంబ సభ్యులకు ప్రగాడ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ పసుపు బోర్డు కమిటీ చైర్మన్ పల్లె గంగారెడ్డి, ఆర్ఎస్ఎస్ ప్రాంత ప్రచార్ లింగాల సుధాకర్‌రెడ్డి, వాసుజీ, గణేశ్ జీ, బీజేపీ రాష్ట్ర నాయకులు పుప్పాల శివరాజ్, ఎల్ భూపతి రెడ్డి, పిప్రి మాజీ ఎంపీటీసీ కేసీ ముత్తెన్న, కలిగోట గంగాధర్, తంబూరి శ్రీనివాస్, దార్ల ముత్తెన్న, నరేష్, భోజా రెడ్డి, ఆకుల శ్రీనివాస్, శ్రీనివాస్ గౌడ్, ఆలకు నర్సారెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.